సరోజినిదేవి ఆసుపత్రి వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి



మెహిదీపట్నంలోని సరోజినిదేవి కంటి ఆసుపత్రి

గోల్కొండ: సరోజిని దేవి కంటి ఆసుపత్రికి వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాలు, నగర శివారు ప్రాంతాల నుంచి బస్సుల్లో వస్తుంటారు. మెహిదీపట్నం ప్రధాన బస్టాప్‌లకు ఈ ఆసుపత్రి అత్యంత సమీపంలో ఉంది. మెహిదీపట్నం నుంచి శంషాబాద్ వెళ్లే పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే ఆసుపత్రి ముందు నుంచే ప్రారంభం అవుతుంది. గచ్చిబౌలి, టోలిచౌకీ, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాల నుంచి సరోజినిదేవి ఆసుపత్రికి వచ్చే రోగులు మెహిదీపట్నంలో దిగి ఆసుపత్రికి వస్తుంటారు. మరో వైపు తిరిగి వెళ్లే సమయంలో వీరు ఆసుపత్రి గేటు నుంచి రోడ్డు దాటి వెళ్లాలి. అదే విధంగా ఆసుపత్రి రోడ్డు అవతల వైపు నుంచి వచ్చే వారు కూడా రోడ్డు దాటి రావాలి. రోడ్డు దాటే సందర్భంలో పలుమార్లు రోగులు ప్రమాదాల బారినపడ్డారు. సుదీర్ఘ కాలం నుంచి ఆసుపత్రి ముందు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలన్న ప్రజల వినతులు బుట్టదాఖలవుతున్నాయి. గత కొన్ని సంవత్సరాల క్రితం మెహిదీపట్నం రైతుబజార్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉండేది. అతి తక్కువ మంది ఆ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ఉపయోగించడంతో ఆ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని అప్పట్లో పూర్తిగా తొలగించారు. ఆ సమయంలోనే బ్రిడ్జిని సరోజి ఆసుపత్రి ముందు నిర్మించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. అయితే ప్రజల వినతులను అధికారులు, నాయకులు పట్టించుకోలేదు. ప్రస్తుతం సరోజినిదేవి కంటి ఆసుపత్రికి వచ్చే రోగుల కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని రోగులు కోరుతున్నారు.

మానసిక వ్యాధిగ్రస్తులకు చేయూతనివ్వడం అభినందనీయం


ప్రత్యేక వాహనాన్ని ప్రారంభిస్తున్న చీఫ్ జడ్జి రేణుక యారా

యాకుత్‌పురా: మానసిక వ్యాధితో బాధపడుతున్న వారికి చేయూతనివ్వడం అభినందనీయమని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకా యారా అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవాన్ని పురస్కరించుకొన్ని సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డీ) ఆర్గనైజేషన్, మనోబంధ్ ఫౌండేషన్ల ఆధ్వర్యంలో మానసిక వ్యాధిగ్రస్తుల చేయూత కార్యక్రమం ప్రత్యేక వాహనాన్ని శుక్రవారం పురానీ హవేలీలోని న్యాయ సేవ సదన్‌లో ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానసిక వ్యాధిగ్రస్తులను చేరదీసి వారికి వైద్య చికిత్సలు అందించి క్షేమంగా వారిని ఇంటికి చేర్చేందుకు ఎస్ఆర్‌డీ, మనోబంధ్ ఫౌండేషన్ చేస్తున్న సేవ కార్యక్రమాలు ప్రశంసానియమన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు చీఫ్ జడ్జి మురళీ మోహన్, సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికర సంస్థ కార్యదర్శి కిరణ్ కుమార్, ఎస్ఆర్‌డీ ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఐఎంహెచ్‌చ్ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ భద్రం, ఎస్ఆర్‌డీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు


రేవంత్‌రెడ్డి మాస్కులు ధరించిన విద్యార్థులు

అబిడ్స్: పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థుల సంక్షేమానికి మాజీ ముఖ్యమంత్రి ఎలాంటి కృషి చేయకుంటే.. పది నెలల కాంగ్రెస్ పాలనలో సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. విద్యార్థుల మెస్, కాస్మొటిక్ ఛార్జీలు పెంచిన ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ కేక్ కట్‌చేసి విద్యార్థులకు మిఠాయిలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..లక్షలాది మంది విద్యార్థులకు అండగా నిలిచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే


ఆదర్శనగర్‌లో జెడ్సీకి సర్వే వివరాలు వెల్లడిస్తున్న డిప్యూటీ కమిషనర్ విద్యాధర్

గన్‌ఫౌండ్రీ: గోషామహల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయత్ పర్యవేక్షించారు. నియోజకవర్గం పరిధిలోని బషీర్‌బాగ్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో ఇంటింటా పర్యటించారు. అబిడ్స్-14వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నియోజకవర్గంలో సర్వే పర్యవేక్షించిన అనురాగ్ జయంత్ మాట్లాడుతూ..గోషామహల్ నియోజకవర్గంతో పాటు గోషామహల్, కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలతో పాటు ఖైరతాబాద్ జోన్‌లోని అన్ని ప్రాంతాల్లో సర్వే భేష్‌గా కొనసాగుతుందన్నారు. తాను పలు బస్తీలు, ప్రాంతాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు ఎన్యుమరేటర్లు చేపడుతున్న సర్వే వివరాలను క్షుప్తంగా తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని ప్రాంతాల్లో సిబ్బంది పర్యటించి ఇంటింటా సామాజిక, ఆర్థిక సర్వే వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అబిడ్స్-14ద సర్కిల్ డిప్యూటీ కమిషనర్ విద్యాధర్‌తో పాటు మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలి


పతకాలను అందజేస్తున్న కీర్తిరెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని 'ది గడియం స్కూల్' వ్యవస్థాపకురాలు కె.కీర్తిరెడ్డి అన్నారు. గత రెండు రోజులుగా తెలంగాణ జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 6వ ఇంటర్ డిస్ట్రిక్ జిమ్నాస్టిక్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు డిసెంబర్ 25 నుంచి గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.సోమేశ్వర్, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని అంతం చేయడంలో యువత పాత్ర కీలకం




పంజగుట్ట: అవినీతిని అంతం చేయడంలో యువత పాత్ర ఎంతో కీలకమని ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ అన్నారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమంలో భాగంగా సమైఖ్య భారతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్ర సంఘటన్, కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వ శాఖల సహకారంతో శుక్రవారం ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సై నాగరాజు, సమైఖ్య భారతి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అవినీతిని అంతమొందించడంలో ప్రతీఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. అవినీతి లేని సమాజం రూపొందించేందుకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ మార్పు ఎక్కడ నుంచో రావాలని చూడకూడదని, మననుంచే మార్పు రావాలని అవినీతి ఎక్కడ జరిగినా ధైర్యంగా నిలదీయాలన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సమాజంలో అవినీతి, లంచగొండితనం మితిమీరిపోయిందని, దాన్ని అరికట్టేందుకు విద్యార్థులు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వ్యాసరచన పోటీల్లో 40 మంది విద్యార్థులు పాల్గొనగా డి.రాహుల్ ప్రథమ బహుమతి, బి.రవీందర్ ద్వితీయ బహుమతి, ఈ.శివ తృతీయ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రవీందర్, ఎస్.విజయలక్ష్మి, అధ్యాపకులు వి.వి.సుబ్బారావు, జగన్నాధరావు, గిరిధర్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ద్వాదశ జ్యోతిర్లింగాలకు ప్రసిద్ధి..

శివబాగ్ క్షేత్రం

జియాగూడ సమర్థ నారాయణ ఆశ్రమంలో కొలువుదీరిన మహా శివుడు

- గోమాతలకు నిలయం
- నిరుపేదలకు నిత్యాన్నదానం
- కార్తీక మాసం కావడంతో భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయాలు





జియాగూడ: జియాగూడలోని సమర్థ నారాయణ ఆశ్రమంలో కార్తీక మాసంలో 12 జ్యోతిర్లింగాల దర్శనాల కోసం ప్రతిరోజూ భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలను దర్శించుకుంటున్నారు. 12 జ్యోతిర్లింగాలు ఆశ్రమం నలు దిక్కులా వ్యాపించి మహా పుణ్యక్షేత్రంగా శివబాగ్‌గా ఖ్యాతి గాంచింది. ఈ ఆలయాలలో ఏడాది పొడవునా ఉత్సవాలు నిర్వహిస్తారు.


12 జ్యోతిర్లింగాలు..

శివబాగ్‌గా పేరుగాంచిన ఆశ్రమంలో తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ, ఈశాన్యం నైరుతి, ఆగ్నేయం దిశలలో 12 జ్యోతిర్లింగాలను స్థాపించారు. ముఖ్యంగా అమరేశ్వరుడు, ఋతేశ్వరుడు, ముక్తేశ్వరుడు, కాశీవిశ్వనాథుడు, రామేశ్వరుడు, సోమనాథేశ్వరుడు, వైద్యనాథేశ్వరుడు, నాగేశ్వరుడు, ఓంకారేశ్వరుడు, హరిహరేశ్వరుడు, భీమేశ్వరుడు, కేదరేశ్వరుడు, స్పటిక లింగం, మహాశివుడు తదితర శివలింగాలు కొలువుదీరి ఉండడంతో సమర్థ నారాయణ ఆశ్రమం భక్తులతో విరాజిల్లుతుంది.

విశాలమైన కామధేను గోశాల..

భారత దేశంలో ఎక్కడ గోమాత ఆలయం లేదు. సమర్థ నారాయణ ఆశ్రమంలో గోమాత కొమ్ముల మధ్య నుంచి అమరేశ్వరుడిని దర్శించుకోవడం భక్తులు అదృష్టంగా భావిస్తారు. ఈ విశాలవంతమైన ఆశ్రమంలో సుమారు 6 వేలకు పైగా గోవులు సేదా తీరుతున్నాయని ఆశ్రమ 12వ పీఠాధిపతి ప్రభుదత్త మహారాజ్ తెలిపారు.


ఒకే పానపట్టంపై కొలువుదీరిన హరిహరేశ్వరులు




శివబాగ్ ఆలయాలలో కొలువుతీరిన జ్యోతిర్లింగాలు

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

నాంపల్లి: రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాంపల్లి జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..హైటెక్‌సిటీ-హఫీజ్‌పేట రైల్వే స్టేషన్ల మధ్యలో శుక్రవారం ఓ గుర్తు తెలియని యువకుడు (26) ఎంఎంటీఎస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. శవ పంచనామ నిర్వహించి పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడి ఒంటిపై ఆకు పచ్చ రంగు టీ షర్టు, నలుపు రంగు జీన్స్ ప్యాంటు ధరించినట్లు పోలీసులు తెలిపారు. సంబంధీకులెవరైనా ఉంటే నాంపల్లి జీఆర్పీ పోలీసులను లేదా 99898 72799లో సంప్రదించాలని కోరారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదానం


అన్నదానం నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని, కేఆర్.రాజ్‌కుమార్

అబిడ్స్: టీఎన్జీఓస్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో ఎంఎన్‌జే ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని దాదాపు 1000 మంది రోగుల సహాయకులకు అల్పాహారం, అన్నదానాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ఎంఎన్‌జే ఆసుపత్రి సంచాలకులు శ్రీనివాస్‌లు, టీఎన్జీఓస్ నాయకులు కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, విక్రమ్ కుమార్, యూనిట్ సభ్యులు శివకుమార్, ముస్తఫా షరీఫ్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి

కాచిగూడ: ఆత్మరక్షణ కోసం విద్యార్థులు కరాటే నేర్చుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీ రామన్‌గౌడ్ అన్నారు. జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 19వ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో భాగంగా మహిళా విభాగంలో గ్రాండ్ చాంపియన్ షిప్ కై వసం చేసుకున్న విద్యార్థిని యోగినిని ఆమె ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. మహిళలకు ఆత్మరక్షణ కోసం కరాటే ఎంతగానో ఉపయోగపడతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, నర్సింగ్‌రావు, కరీమ్, శ్యాంకుమార్, హంస, అమృతరెడ్డి, గణ సంతోషిణి, రంజిత్ సింగ్, కరాటే విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీసీపీ స్నేహ మెహ్రా

చాంద్రాయణగుట్ట: విద్యార్థులు సామాజిక మాధ్యమాలలో వ్యక్తిగత వివరాలు నమోదు చేసి ఇబ్బందులకు గురి కారాదని దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా సూచించారు. ఫలక్‌నుమాలోని ప్రోగ్రెస్ విద్యాసంస్థలో విద్యార్థులకు సైబర్ క్రైమ్స్, షీ టీమ్ అధికారులతో కలిసి అవగాహన కల్పించారు. ప్రస్తుతం పార్సెల్ స్కామ్స్, డిజిటల్ అరెస్ట్, ఏపీకే ఫైల్ ఫ్రాడ్స్, ఓటీపీ, బ్యాంక్, పార్ట్ టైమ్ జాబ్, ఇన్వెస్ట్‌మెంట్, ఫేక్ లోన్ యాప్ తదితర స్కామ్‌లు వెలుగుజూస్తున్నాయన్నారు. ఇన్‌స్టా, ఫేస్‌బుక్ లాంటి యాప్‌లలో సొంత వివరాలు పొందుపరిచి మోసాలకు గురవుతున్నారన్నారు. ఇలాంటి మోసాలపై అవగాహన పొంది, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈవ్ టీజింగ్ లాంటి ఘటనలపై పోలీస్ సాయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్ జహంగీర్, ఫలక్‌నుమా, ఛత్రినాక డివిజన్ల ఏసీపీలు జావిద్, సీహెచ్.చంద్రశేఖర్, సీసీఎస్ ఏసీపీ ప్రసన్నలక్ష్మి, ఇన్‌స్పెక్టర్లు ధనలక్ష్మి, ఆదిరెడ్డి, రవి కుమార్, నరేష్, పాఠశాల చైర్మన్ మీర్జా మహ్మద్ అలీ బేగ్, కరస్పాండెంట్ మీర్జా మహ్మద్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఔషధ మొక్కల ప్రదర్శన


అవగాహన కల్పిస్తున్న అఖిల్

అబిడ్స్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకర జీవితం పొందేందుకు పలు రకాల ఔషధ మొక్కలను ప్రగతి రిసార్ట్స్ ప్రదర్శన చేపట్టింది. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో కొనసాగుతున్న హెచ్ఎస్ఎస్ ఫేయిర్‌లో ఔషధ మొక్కలను అందుబాటులో ఉంచి వాటి ప్రయోజనాలను వివరిస్తున్నారు. యాంత్రిక జీవితంలో మనుషులను వేధిస్తున్న ప్రధాన ఆరోగ్య సమస్యలైె బీపీ, షుగర్, థైరాయిడ్, కీళ్లనొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలను మొక్కల ఆకులను సేవించి ఎలా తగ్గించుకోవాలో వివరిస్తున్నారు. ఒక్కో మొక్క మనిషి ఆరోగ్యాన్ని సుభిక్షంగా ఉండేందుకే దోహదపడుతున్నాయని ప్రగతి రిసార్ట్స్ ప్రతినిధి అఖిల్ తెలిపారు. ప్రధానంగా సదాపాకు, మస్కిటో జెరినీయం, సంపంగి, ఇన్సులిన్, ర్యాబిట్, మింట్లు తులసి, రణపాల, లెమన్‌గ్రాస్, లవంగ తులసి, మల్లీ విటమిన్ ప్లాంట్, పారిజాత, పచౌలి, డేకింగ్, కిడ్నీటీలీఫ్, లాంగ్ పెప్పర్, డెటాల్ లీఫ్ లాంటి పలు రకాల ఔషధ మొక్కలను ఆరోగ్య సంరక్షణకు అందుబాటులో ఉంచారు. ఒక్కో ఔషధ మొక్క ఆకులను సేవించినా, ఔషధ మొక్క ఆకులను ఛాయ్‌లో లేదా వేడినీటిలో వేసుకొని సేవిస్తే కొద్ది రోజుల్లోనే ఆయా రోగాలు నాయమవుతాయని ఆయన వివరించారు. మనిషిలో ఏర్పాడే వివిధ రకాల రోగాలను తగ్గించే ఔషధ మొక్కలను ప్రదర్శనలో ఉంచి వాటి ఉపయోగాలు సందర్శకులకు క్షుప్తంగా వివరిస్తున్నారు.

రైల్వే పోలీసుల తనిఖీల్లో భారీగా గంజాయి స్వాధీనం


పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి

నాంపల్లి: రైళ్లలో గంజాయిని తరలించే ఓ వ్యక్తిని జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.4 లక్షల 13 వేలు విలువ చేసే 16.545 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన నాంపల్లి జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలోని లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకుంది. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన హనుమంత్ అనిల్ సోన్వే వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. అక్రమ సంపాదన కోసం గంజాయి స్మగ్లర్‌గా మారాడు. సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం లింగంపల్లి రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ పోలీసులు హనుమంత్ అనిల్ సోన్వే దగ్గర ఉన్న రెండు బ్యాగులను సోదా చేయగా అందులో గంజాయిని నింపిన మూడు బండిల్స్ బయటపడ్డాయి. ఖాజీపేట నుంచి కళ్యాణ్‌కు తరలిస్తున్నట్లుగా ఇన్‌స్పెక్టర్ తెలిపారు. విక్కీ అనే వ్యక్తి హనుమంత్‌కు డబ్బులు ఇచ్చి తెలంగాణ నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్


వంశీ

సుల్తాన్‌బజార్: బాలికను కిడ్నాప్ చేసి ఆమెపై లైంగిక దాడికి పాల్పడి బలవంతంగా పెళ్లి చేసుకున్న ఓ వ్యక్తిని శుక్రవారం సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేశారు. శ్రీనివాసచారి తెలిపిన వివరాల ప్రకారం..నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం, అల్లగడప గ్రామానికి చెందిన వంశీ(26) వృత్తిరీత్యా ఫొటోగ్రాఫర్. ఓ మైనర్ బాలికపై కన్నేసిన వంశీ ఆమెను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అంతటితో వదలకుండా బలవంతంగా పెళ్లి చేసుకున్నాడు. దీంతో ఆ మైనర్ బాలిక సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించగా నిందితుడిపై పోక్సో కేసును నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గోల్కొండ: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మలను తొలగిస్తున్న కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులో ఓ ప్రకటనలో తెలిపారు. టోలిచౌకీ విద్యుత్ సబ్‌స్టేషన్ పారామౌంట్ కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని పారామౌంట్ కాలనీ, పేపర్ బోర్డు, హకీంపేట్ హనుమాన్ టెంపుల్, అంబేడ్కర్ కమ్యూనిటీహాల్, బౌలీపీటీ, బాబా హోటల్, ఖబరస్తాన్-1, 2 ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే టోలిచౌకీ సబ్‌స్టేషన్ అమీనా మసీద్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని అమీనామసీదు ఏరియా, పారామోంట్ కాలనీ గేట్-2, గేట్-4 ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. నాంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని విజయనగర్ కాలనీ 11కేవీ ఫీడర్ పరిధిలోని విజయనగర్ కాలనీ, బస్టాప్, వీఎన్‌సీ ఫుడ్ వరల్డ్, లక్కీ కిరాణా అండ్ జనరల్ స్టోర్, మిల్క్ బూత్ ఓల్డ్ అండ్ న్యూ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గంగానగర్, రాంసింగ్‌పురా పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ గంగానగర్, రాంసింగ్‌పురా విద్యుత్ ఫీడర్ల పరిధిలోని కమేళా గేట్, గంగానగర్, సనా హోటల్, ఆర్యసమాజ్, ఎంసీహెచ్ పార్క్, తాళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సీబీఐ ట్రూప్ బజార్ ఫీడర్ల పరిధిలోని గుజరాతీగల్లీ, సీబీఐ, కోఠిలోని ప్రభుత్వ ఈఎన్‌టీ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

దేవర కరుణాకర్ సేవలు వెలకట్టలేనివి


కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాగరాజు

గోల్కొండ: దివంగత బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ దేవర కరుణాకర్ సేవలను వెలకట్టలేమని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. దేవర కరుణాకర్ కుమారుడు దేవర వంశీ నిర్వహిస్తున్న కరుణాకర్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఆహ్వాన పత్రికను శుక్రవారం గుడిమల్కాపూర్ డివిజన్ బీజేపీ ఓబీసీ విభాగం ప్రధాన కార్యదర్శి రాజారామ్ నాగరాజు కేంద్ర మంత్రికి అందించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలకు పైగా దేవర కరుణాకర్ పార్టీ ప్రతిష్టతకు అలుపెరుగకుండా కృషి చేశారని అన్నారు.

ఆర్థిక సహాయం


రఘునాథ్‌రెడ్డి కుంటుంబసభ్యులకు చెక్కును అందజేస్తున్న జంగయ్య, రవి

యాకుత్‌పురా: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హరిబౌలి రిఫాయం ప్రభుత్వ ఎయిడేడ్ పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయుడు జి. రఘునాథ్ రెడ్డి కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. పాఠశాలలో నిర్వహించిన సంస్మరణ సభలో కుటుంబ సంక్షేమ నిధి నుంచి రూ.6 లక్షల చెక్కును యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, రవి వారి రఘునాథ్ రెడ్డి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో చార్మినార్, బహదూర్‌పురా మండలల డిప్యూటీ ఈఓలు నెహ్రూబాబు, పోమ్యనాయక్, పాఠశాల కరస్పాండెంట్ పుల్లారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకుట్ పూజలు


వేడుకల్లో నగరి లక్ష్మీనారాయణ్, హెచ్.కుమార్ తదితరులు

జియాగూడ: సహస్రార్జున్ రాజ రాజేశ్వర్ మహారాజ్ జయంతి వేడుకల సందర్భంగా రహింపురా ఎస్ఎస్‌కే సమాజ్‌లో అంకుట్ పూజా వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం 21 మంది సభ్యులు అకుంట్ పూజా వేడుకలు చేపట్టి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ నాయకులు నగరి లక్ష్మీనారాయణ్, హెచ్.కుమార్, నగరి సురేందర్, పూజారి రాజేశ్వర్, నర్సింగ్, ధన్‌రాజ్, శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలు ధరించి అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసన

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్ వర్సిటీ ఐక్య కార్యాచరణ సమితి సభ్యులు నిరసనను కొనసాగించారు. అధ్యాపక, అధ్యాపకేతర, ఉద్యోగ సంఘాల నేతలు శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్ పల్లవీ కాబ్డే, కన్వీనర్ వద్దానం శ్రీనివాస్, జేఏసీ నేతలు ఎల్వీకే రెడ్డి, శ్రీనివాస్, వేణుగోపాల్, రజనీకాంత్, రాములు, రుషేంద్రమణి, అవినాష్, కిషోర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో సమయ పాలన పాటించాలి

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శానిటేషన్ డ్రైవర్లతో కమిషనర్ బి.శరత్‌చంద్ర సమావేశమయ్యారు. కాళీమందిర్ సమీపంలో ఉదయం 5 గంటలకు శానిటేషన్ డ్రైవర్లతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమయ పాలన పాటించాలని, ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావద్దని స్పష్టం చేశారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ ఆదేశాలను విస్మరించి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.